క్లుప్తంగా

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం

కరకగూడెం: కరకగూడెం జెడ్పీహెచ్ఎస్‌లోని ఓపెన్ స్కూల్ సొసైటీ సెంటర్‌లో ప్రవేశాలు ప్రారంభమయ్యాయని కోఆర్డినేటర్ గడ్డం మంజుల తెలిపారు. పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలు కల్పిస్తుండగా, చదువు మధ్యలో ఆపేసిన వారు లేదా రెగ్యులర్‌గా పాఠశాలలకు వెళ్లలేని వారు చేరొచ్చని వెల్లడించారు. వివరాలకు 9491104082 నంబర్‌నుగాని, సెంటర్‌లోగాని సంప్రదించాలని ఆమె సూచించారు.

మణుగూరురూరల్: 2025–26 విద్యాసంవత్సరానికి గానూ మండలంలోని వాగుమల్లారంలో గ్రేస్ మిషన్ పాఠశాలలో ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల కోఆర్డినేటర్ ఎం.మల్లేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11వ తేదీలోపు అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకుని పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. కుల, ఆదాయ, స్టడీ, ఆధార్ కార్డులతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 7288878689, 9182863149 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

బదిలీ అధికారికి సత్కారం

మణుగూరుటౌన్: కార్మిక సంక్షేమంతో పాటు సంస్థ ప్రగతి కోసం సింగరేణి అధికారి కె.వెంకట్రావు అందించిన సేవలు అభినందనీయమని టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకట్ అన్నారు. బుధవారం కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాకు బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. నాయకులు పవన్‌కుమార్, రమేశ్, ఫిట్ సెక్రటరీ, శ్రీనివాస్, ఇమ్రాన్, నరేశ్, కుమార్, వినయ్‌కుమార్, కల్యాణ్, రాజేంద్రప్రసాద్, కృష్ణ తదితరులు ఉన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

మణుగూరు రూరల్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీతామహాలక్ష్మి, ఎం.జ్యోతిలు డిమాండ్ చేశారు. బుధవారం వారు మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని సందర్శించి రోగులను పరామర్శించారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సదుపాయాలపై రోగులను, వైద్యసేవలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ఐద్వా మండల అధ్యక్షురాలు దొడ్డి నిర్మల, నాయకులు పిట్టల నాగమణి, కోండ్రు గౌరి, బోడ నాగమ్మ పాల్గొన్నారు.

హరినాథ్ బాబా జయంతి

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి దేవస్థానం సమీపంలోని రంగానాయకుల గుట్ట మీద నెలకొన్న కుసుమ హరినాథ్ బాబా దేవస్థానంలో స్వామివారి 160వ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ చైర్మన్ యక్కటి శ్రీనివాసరావు, సభ్యులు తంబళ్ల కృష్ణార్జునరావు, పునుగుపాటి సీత, కనకదుర్గ అమ్మవారి ఆలయ చైర్మన్ గంగాభారతి, ఆలయ అర్చకులు శ్రీరంగం నరసింహచార్యులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ బలోపేతానికి కృషి చేయాలి

మణుగూరురూరల్: భారత కమ్యూనిస్ట్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.అయోధ్య నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన మండల, పట్టణ కార్యవర్గ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానికంగా పార్టీ అభివృద్ధికి పాటుపడుతూనే త్వరలో జరగబోయే ఎనికల్లో సీపీఐ అభ్యర్థుల గెలుపుకు శ్రమించాలని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీకుమారి, జక్కుల రాజబాబు, సుధాకర్, ఎస్‌కె.సర్వర్, కుటుంబరావు, బి.సమ్మక్క, డి.నిర్మల, గడ్డం వెంకటేశ్వర్లు, దశరథం, టి.రమేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ కమ్యూనిస్టులదే..

ములకలపల్లి: భవిష్యత్ కాలమంతా కమ్యూనిస్టులదే అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య అన్నారు. ములకలపల్లిలో నిర్వహిస్తున్న పార్టీ రాజకీయ శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. గ్రామస్థాయిలో ప్రజాపోరాటాల ద్వారా పార్టీని పటిష్టపరచాలని కార్యకర్తలకు సూచించారు. సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, ఊకంటి రవికుమార్, నిమ్మల మధు, పొడియం వెంకటేశ్వర్లు, రావూజా, నాగేశ్వరరావు, అమల, అనసూర్య పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

అశ్వారావుపేటరూరల్: త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ పోటీ చేస్తుందని, కేడర్ అంతా సిద్ధంగా ఉండాలని ఆ పార్టీ నియోజకవర్గ బాధ్యుడు కట్రం స్వామిదొర పిలుపునిచ్చారు. బుధవారం అశ్వారావుపేటలో జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. టీడీపీ లక్ష్యంగా బీఆర్ఎస్ ఆరోపణలు చేయడం తగదని, కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని అన్నారు. సమావేశంలో మండలాల అధ్యక్షులు నార్లపాటి శ్రీను, తేల చిన్నయ్య, వలిపాషా, నాయకులు కట్టం యర్రప్ప, అంకోలు వెంకటేశ్వరరావు, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

తవ్వితే.. నెలలు గడవాల్సిందే!

- అశ్వారావుపేటలో నత్తనడకన అభివృద్ధి పనులు
- ప్రధాన రహదారుల్లో బురద
- కూడళ్లు గుంతలమయం


సత్యదుర్గ స్వీట్స్ వద్ద రోడ్డు దాటేందుకు వీల్లేకుండా మురుగు, బురద


పాత ఆంధ్రాబ్యాంక్ వీధి ముఖద్వారం వద్ద తవ్విన రహదారి


వినాయకుడి గుడి ఎదురుగా దుకాణాల్లోకి దారి లేకుండా బురద

అశ్వారావుపేట: అశ్వారావుపేట పట్టణంలో మెగా డ్రెయినేజీ, సెంటర్ లైటింగ్ పనులు ఏడాదిగా పట్టణ వాసులకు నరకం చూపిస్తున్నాయి. కాంట్రాక్టర్‌లకు అధికారులు, ప్రజాప్రతినిధులు తలొంచినట్లుగా వీరి చేష్టలు స్థానికులకు అనుమానాలు కలిగిస్తున్నాయి.

ఒక కల్వర్టు నిర్మించాలంటే నెలల తరబడి సమయం తీసుకోవడం.. సెంటర్ లైటింగ్‌కు డివైడర్ నిర్మించాలంటే రహదారిని తవ్వి వారాల తరబడి వదిలేయడం.. కల్వర్టు నిర్మించిన తర్వాత అప్రోచ్ కోసం నెలల తరబడి వేచి ఉంటడం స్థానికులను బహు ఇబ్బందిని కలిగిస్తోంది. అశ్వారావుపేట రింగ్ సెంటర్ నుంచి మున్సిపాలిటీ కార్యాలయం వరకు ఏ విధంగానూ వెళ్లే పరిస్థితి లేదు. జంగారెడ్డిగూడెం రోడ్ నుంచి వచ్చే మురుగు నీరు. పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న హోటళ్ల నుంచి వచ్చే వ్యర్థపు నీరు బీటీ రహదారిపై ప్రవహిస్తూ ఉంటోంది. పాదచారులు మురుగునీటిలో నడవాల్సిందే. ద్విచక్ర వాహనాల జల్లు ఇతర వాహనదారుల మీద పడుతోంది. అయినా పట్టించుకునే నాథుడే లేడని స్థానికులు వాపోతున్నారు.

నెలల తరబడి పనులు

పోలీస్ స్టేషన్ ఎదుట మున్సిపల్ కార్యాలయం రోడ్‌కు అంతర్గత పైప్‌లైన్ డ్రెయినేజీ కోసం తవ్వి రహదారిని సగం మూసేశారు. ఆ పని ఇంకా కొనసాగుతూనే ఉంది. ఇటీవల సీపీఐ కార్యాలయంతో సహా చిరు వ్యాపారులు దుకాణాలను కూల్చేశారు. కానీ ఇక్కడ మురికి గుంతలుగా ఏర్పడ్డా.. రహదారి వాడకానికి వినియోగంలో లేదు. అయ్యర్ బిల్డింగ్ నుంచి భద్రాచలం రోడ్‌లో ఇరువైపుల అడుగడుగునా గుంతలే. మంచినీటి పైప్‌లైన్ సైతం నెలల తరబడి మరమ్మతు చేస్తున్నారు. డివైడర్ నిర్మాణం నెలల తరబడి కొనసాగుతోంది. విరిగిన విద్యుత్ స్తంభాల స్థానంలో నూతన స్తంభాల ఏర్పాటు నెలల పాటి ప్రక్రియే.

వాహనదారులకు ఇక్కట్లు

ప్రధాన మార్కెట్‌లో ట్రాఫిక్ ఎక్కువగా ఉండే రహదారిని వినియోగానికి తీసుకురాకుండా గాలికొదేలేశారు. దీంతో వర్షం పడితే బురదతో ఇబ్బంది.. బురద ఆరితే దుమ్మెత్తిపోసినట్లు మట్టితో ఇబ్బంది పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ, మున్సిపల్, ట్రాన్స్‌కో అధికారులు, ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో స్థానికులను ఇబ్బందుల పాలు చేయకుండా కాపాడాలని కోరుతున్నారు.

వరదలపై అప్రమత్తంగా ఉండాలి



అశ్వాపురం: సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ మణిధర్

అశ్వాపురం: భారీ వర్షాలు, గోదావరి వరదల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ మణిధర్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని రైతువేదికలో బుధవారం వరదలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. వరదల సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ఏ ఇబ్బంది కలిగినా ప్రజలు వెంటనే సిబ్బందికి తెలియజేయాలన్నారు. ప్రజలు వాగులు దాటే ప్రయత్నం చేయవద్దన్నారు. ప్రజలు ఆందోళన చెందవద్దని అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటారని వెల్లడించారు. సమావేశంలో ఏడీఏ తాతారావు, ఎంపీడీఓ ముత్యాలరావు, సీడీపీఓ రేవతి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల సమీక్ష


పినపాక: మండల పరిషత్ కార్యాలయంలో వరదలపై సమీక్షిస్తున్న అధికారులు

పినపాక: రానున్న వర్షాకాలంలో వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సునీల్ కుమార్ అధ్యక్షతన అన్ని శాఖల అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు. శాఖల సమన్వయంతో ముంపునకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పనిచేయాలని, ప్రాణ నష్టం జరగకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేశ్వరరావు, ప్రాథమిక వైద్యులు మధు, దుర్గ భవాని, సీఐ వెంకటేశ్వర్లు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో వైద్యసేవల తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ స్పందన

చండ్రుగొండ: సీజనల్‌లో ప్రబలే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు చర్యలు తీసుకోవాలని మలేరియా జిల్లా అధికారిణి డాక్టర్ స్పందన మండల వైద్యాధికారులకు సూచించారు. చండ్రుగొండలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్యకేంద్రంలో రోజువారి రోగుల సంఖ్యను పరిశీలించారు. జ్వరపీడితుల పరిస్థితులపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో ప్రజలను పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని ఆమె వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు కనకం తనుజ, వెంకట్‌ప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆఫ్‌టైప్ మొక్కల పరిశీలన


పట్వారిగూడెంలో పామాయిల్ క్షేత్రంలో ఆఫ్‌టైప్ మొక్కలను పరిశీలిస్తున్న నాయకులు

దమ్మపేట: ఆఫ్‌టైప్ పామాయిల్ మొక్కల వల్ల తీవ్రంగా నష్టపోయిన రైతుల పామాయిల్ క్షేత్రాలను భారతీయ కిసాన్ సంఘ్(బీకేఎస్) రాష్ట్ర సంఘటనా కార్యదర్శి రాజిరెడ్డి, సభ్యులు పరిశీలించారు. బుధవారం మండలంలోని పట్వారిగూడెం, జగ్గారం గ్రామాల పరిధిలోని పామాయిల్ క్షేత్రాలను స్థానిక రైతులతో కలసి సందర్శించారు. క్షేత్రాల్లో జన్యులోపం గల అనేక పామాయిల్ మొక్కలను, కాపు లేక నరికివేయబడిన మొక్కల మొదటి భాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నష్టపోయిన రైతులకు న్యాయం చేసేలా తమవంతుగా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీకేఎస్ సభ్యులు పురుషోత్తం, కృష్ణారెడ్డి, తూము అప్పారావు, పామాయిల్ రైతు సంఘం నాయకులు తుంబూరు మహేశ్వరరెడ్డి, మద్దినేని వెంకటేశ్వర్లు, కొక్కెరపాటి పుల్లయ్య, చెలికాని సూరిబాబు పాల్గొన్నారు.

ఎస్ఐగా మేడా ప్రసాద్ బాధ్యతలు



బూర్గంపాడు: బూర్గంపాడు ఎస్ఐగా మేడా ప్రసాద్ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన రాజేశ్ బదిలీపై వెళ్లగా మణుగూరు ఎస్ఐగా పనిచేస్తున్న ప్రసాద్ ఇక్కడకు బదిలీపై వచ్చారు. శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

ఏటీఏ ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ

దుమ్ముగూడెం: ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నామాద్రి సత్యనారాయణ బుధవారం ఎంపికయ్యారు. సత్యనారయణ మండల పరిధిలోని మంగువాయి బాడవ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్)గా పనిచేస్తున్నారు. అలాగే మండలంలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులలో జిల్లా కార్యదర్శులుగా కొర్స చిట్టిబాబు, కొర్స రాజేష్, జిల్లా మహిళా కార్యదర్శిగా మర్మం వరలక్ష్మీదేవి, తోలెం సుజాత ఎన్నికయ్యారు. వీరికి ఏటీఏ మండలం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసం ఆదినారాయణ, పూనెం రమేష్, ఇతర నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

రిటైనింగ్ వాల్ పరిశీలన


చిరుమళ్ల బ్రిడ్జి రిటైనింగ్ వాల్‌ను పరిశీలిస్తున్న అధికారులు

కరకగూడెం: మండల కేంద్రంలోని చిరుమళ్ల బ్రిడ్జికి అనుసంధానంగా రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన రిటైనింగ్ వాల్‌ను బుధవారం కరకగూడెం ఎంపీడీఓ కుమార్ పరిశీలించారు. గతంలో కురిసిన భారీ వర్షాలకు చిరుమళ్ల బ్రిడ్జి వద్ద రహదారి తీవ్రంగా కోతకు గురైందని, ఇప్పుడు నిర్మించిన ఈ రిటైనింగ్ వాల్ రహదారి కోతను నివారించడమే కాకుండా, బ్రిడ్జికి మరింత బలాన్ని చేకూర్చిందని తెలిపారు. దీంతో స్థానికుల ఇబ్బందులు తొలిగిపోయాయని వెల్లడించారు. రాబోయే 23 రోజుల్లో గ్రావెల్ (కంకర) ద్వారా బ్రిడ్జి రోడ్డును కూడా సరిచేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో ఎంపీఓ మారుతీ యాదవ్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

వర్షానికి తడవాల్సిందేనా!?


జోరు వర్షంలో తడిసిపోతున్న విద్యార్థుల సైకిళ్లు

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైకిల్ స్టాండ్ షెడ్డు లేకపోవడంతో విద్యార్థుల సైకిళ్లు ఎండకు ఎండుతూ.. వర్షానికి తడుస్తున్నాయి. అశ్వారావుపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలుర, బాలిక పాఠశాలలు ఒకే ఆవరణలో ఉంటాయి. ఆయా పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు సుమారు 700 మందికిపైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కాగా, ఆయా విద్యార్థులు వినియోగించే సైకిళ్లను పార్కింగ్ చేసేందుక ప్రత్యేకంగా సైకిల్‌స్టాండ్ షెడ్డు లేదు. దీంతో విద్యార్థులంతా పాఠశాల ఆవరణలోని చెట్లకిందే పార్కింగ్ చేస్తుండగా, వర్షాలు కురిస్తే తడిసిపోతున్నాయి.

సైకిల్ స్టాండ్ కోసం షెడ్డు నిర్మించేలా పాలకులు తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఎల్ఓసీ అందజేత

మణుగూరుటౌన్: మండలంలోని చెందిన తెల్లం బాలకృష్ణ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బుధవారం ఎల్ఓసీ మంజూరు పత్రాన్ని అందజేశారు. తోగ్గూడెం గ్రామానికి చెందిన బాలకృష్ణ అనారోగ్యానికి గురి కాగా అత్యవసర వైద్యం కోసం రూ.2.50లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పాయం హైదరాబాద్‌లో అందజేశారు. ఎమ్మెల్యేకు ఈ సందర్భంగా వారు ధన్యవాదాలు తెలిపారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.3 లక్షలు నిధులు మంజూరైనట్లు కొత్తగూడెం డిపో మేనేజర్ దేవేందర్‌గౌడ్ తెలిపారు. మంగళవారం ఆయన ఆర్టీసీ బస్టాండ్‌ను సందర్శించారు. ఇటీవల చండ్రుగొండకు వచ్చిన కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు స్థానికులు బస్టాండ్ పరిస్థితిని వివరించారు. ఈ క్రమంలో కలెక్టర్ చొరవతో నిధులు మంజూరయ్యాయి. డీఎంతోపాటు ఎంపీడీఓ బయ్యారపు అశోక్, పంచాయితీరాజ్ ఏఈ శ్రీనివాసరావు బస్టాండ్ ప్రాంగణాన్ని సందర్శించి మురుగుదొడ్ల నిర్మాణ స్థలాన్ని నిర్ధారించారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రోత్సహించాలి

కరకగూడెం: పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల భాగస్వామ్యాన్ని ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని భట్టుపల్లి కాంప్లెక్స్ హెచ్ఎం మోహన్ బాబు సూచించారు. బుధవారం కలవలనాగారం ఎంపీపీఎస్ పాఠశాలలో విద్యార్థులు సేకరించిన విత్తనాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. భవిష్యత్తులో పాఠశాల తోటల పెంపకానికి లేదా ఇతర పర్యావరణ కార్యక్రమాలకు ఈ విత్తనాలు ఉపయోగపడే అవకాశం ఉందని పేర్కొన్నారు. విద్యార్థుల్లో ప్రాథమిక స్థాయి నుండే మొక్కల పెంపకంపై ఆసక్తి కల్పించేందుకు జిల్లా కలెక్టర్ 'విత్తన సేకరణ' పోటీలకు శ్రీకారం చుట్టారని తెలిపారు.

కమిషనర్‌కు సమ్మె నోటీస్

మణుగూరుటౌన్: జూలై 9న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెకు సంబంధించి సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌కు నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు గద్దల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు సత్రపల్లి సాంబశివరావులు మాట్లాడుతూ.. మున్సిపల్‌వార్డులు పట్టణాన్ని పరిశుభ్రంగా చేసే కార్మికులను వారి సమస్యలు పరిష్కరించాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. నాయకులు కొడిశాల రాములు, పల్లపు నాగేశ్వరరావు, సారిక పాల్గొన్నారు.

రోజంతా వానే..

- రహదారులపై చేరిన వరద
- ఊపందుకున్న వాగుల ప్రవాహం
- వ్యవసాయ పనులకు రైతులు రెడీ


కరకగూడెంలో పొలాల్లో నిలిచిన వర్షపు నీరు


అశ్వారావుపేటరూరల్: కూలిన పూరిల్లు


ములకలపల్లి: పూసుగూడెం శివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న ముర్రేడు వాగు

అశ్వారావుపేటరూరల్/ములకలపల్లి: గడిచిన మూడు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు, చెరువుల్లోకి వరదనీరు చేరుతోంది. బుధవారం తెల్లవారుజాము నుంచి రోజంతా వర్షం కురిసింది. అశ్వారావుపేట, ములకలపల్లి, దమ్మపేట, అన్నపురెడ్డిపల్లి, చండ్రుగొండ మండలాల్లో వర్షం భారీ స్థాయిలో కురిసింది. వీటిలో ములకలపల్లి మండలంలో అత్యధికంగా, అశ్వారావుపేటలో అత్యాల్పంగా వర్షపాతం నమోదు కాగా ప్రధాన రహదారులు, డ్రెయినేజీలు వరద నీటితో నిండాయి. కొత్తగా నిర్మించిన డ్రెయినేజీల్లో వరదనీరు ఉదృతంగా ప్రవహించగా, అంతర్గత రోడ్లు బురదమయంగా మారాయి. మండలంలోని పెదవాగు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల్లో వాగుల నుంచి వరదనీరు పోటెత్తగా, రింగ్‌బండ్‌కు జలకళ సంతరించుకుంది. రింగ్‌బండ్ పరిధి దాటి వచ్చిన వరదనీరు క్రస్ట్ గేట్లలో నుంచి బయటకు వెళ్లిపోంది.

గుండాల: ఆళ్లపల్లి, గుండాల మండలాల్లో గత రెండురోజులుగా వర్షం కురుస్తోంది. దీంతో వాగులు స్వల్పంగా పారుతున్నాయి. ఈ ఏడాది ఇదే భారీ వర్షం. మంగళవారం నుంచి బుధవారం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో కిన్నెరసాని, మల్లన్న వాగు, తోట్టివాగు, ఏడు మెళికల వాగు, జల్లేరు తదితర వాగులు స్వల్పంగా ప్రవహించాయి. చెరువులు, కుంటల్లోకి నీరు వచ్చి చేరుతుంది. అంతర్గత రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఈ ఖరీఫ్‌లో ఇదే తొలివాన కావడంతో ఇప్పటికే దుక్కులు చేసుకున్న రైతులు విత్తనాలు నాటడంలో నిమగ్నమయ్యారు. నిన్నా మొన్నటి వరకు ఎండలు కొట్టగా ఈ వానతో వాతావరణం చల్లబడింది.

కరకగూడెం: మండల వ్యాప్తంగా బుధవారం ఎడతెరపి లేకుండా వర్షం కురవగా సాయంత్రం వరకు జన జీవనం స్తంభించింది. దీంతో పలు చోట్ల పొలాల్లో వర్షపు నీరు చేరింది. అంతేకాకుండా విస్తారమైన వర్షాలు రైతన్నల మోముల్లో ఆనందాన్ని నింపాయి. వరుణ దేవుడి కరుణతో భూమి పదునులోకి రావడంతో అన్నదాతలు ఖరీఫ్ సాగు పనులను ముమ్మరం చేసే అవకాశం ఉంది.

పూరి గుడిసె నేలమట్టం

అశ్వారావుపేటరూరల్: గడిచిన మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని తిరుమలకుంట ఎస్సీ కాలనీకు చెందిన మోటూరి బాబురావు–సావిత్రి దంపతుల పూరిల్లు దెబ్బతిని పడిపోయింది. దీంతో రూ.30వేల నష్టం వాటిల్లింది. కాగా, ఆ సమయంలో ఇంట్లోనే ఉన్న కుటుంబీకులు బయటకు పరుగులు తీశారు. ప్రభుత్వం, అధికారులు స్పందించిన ఆదుకోవాలని బాధిత కుటుంబీకులు కోరుతున్నారు.

సాగు పనుల్లో ఉరకలు

కరకగూడెం: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. బుధవారం ఓవైపు వాన కురుస్తున్నా రైతులు, కూలీలు వరి నాట్లు వేయడం, ఇతర పనులు చేస్తూ కనపించారు. సాగు పనులు ముమ్మరవుతుండగా.. కూలీలకు ఉపాధి లభించనుంది.


ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న రైతు


కరకగూడెంలో నాట్లు వేస్తున్న మహిళా కూలీలు

పట్టాల కిందే పనులు..


ఆధార్ సెంటర్‌లో వానకు పైన పట్టాలు కట్టి, కంప్యూటర్లకు కవర్లు తొడిగిన దృశ్యం..

మణుగూరుటౌన్: స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలోని ప్రభుత్వ ఆధార్ కేంద్ర భవనం మరమ్మతులకు గురికావడంతో వానాకాలం వచ్చిందంటే పనిచేసే సిబ్బందికి, వచ్చే లబ్ధిదారులకు తిప్పలు తప్పడం లేదు. పై పెచ్చులు ఊడి కింద పడుతుండటంతో పాటు చమ్మకు వర్షపు నీరు గదిలో లోపల పడుతున్నాయి. దీంతో చిత్రంలో చూపిన విధంగా సిబ్బంది భవనం లోపల వర్షానికి తాము తడవకుండా పైన పట్టాలు, కంప్యూటర్లకు కవర్లు కట్టి సెంటర్‌కు వచ్చే లబ్ధిదారులకు సేవలందిస్తున్నారు. అధిక వర్షం వచ్చినా.. కంప్యూటర్‌పై కవర్ చినిగినా సేవలకు అంతరాయం ఏర్పడక తప్పదు. అధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.